ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
MHR TV
మెదక్ సంపుటి : 18 సంచిక : 310 సోమవారం, జులై 7, 2025 పేజీలు:4 వెల: 1 రూ/
Published from Hyderabad, Medak Nalgonda, Karimnagar, Warangal, Khammam

## సిగాచీ పేలుడు ఘటన

# 43కి చేరిన మృతులు

### - ఆచూకీ లభించని 7 మంది



**హైదరాబాద్** సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో జరిగిన అగ్ని ప్రమాదం మృతుల సంఖ్య 43 కి చేరింది. సోమవారం నాడు సిగాచి పరిశ్రమ పేలుడు ఘటనలో ఓ మృతదేహం గుర్తించగా, మరో ఇద్దరి శరీర అవశేషాలు గుర్తించారు. ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జితేందర్ అనే వ్యక్తితో పాటు మరో వ్యక్తి మృతిచెందారు. దాంతో సిగాచి పరిశ్రమ పేలుడు ప్రమాదంలో మృతుల సంఖ్య 43 కు పెరిగింది. ఆచూకీ దొరకని 9 మందిలో ఇద్దరు మృతి చెందినట్లు అధికారులు ప్రకటించారు. దాంతో ఇంకా ఆచూకీ లభించని వారు ఏడు మంది ఉన్నారు. ప్రమాదం జరిగి ఆరు రోజులు గడిచిన శిథిలాల తొలగింపు ప్రక్రియ పూర్తి చేయలేదు. ఆదివారం ఏడో రోజు శివాజీ పరిశ్రమ వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.సీఎస్ రామకృష్ణారావు నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైలెవల్ కమిటీ పాశమైలారంలో సిగాచీ కంపెనీ ప్రమాద స్థలాన్ని పలుమార్లు పరిశీలించింది. ఈ ప్రమాదంపై కమిటీ సమగ్ర విచారణ చేపట్టినట్లు తెలిపింది. టెక్నాలజీని ఉపయోగించి డీఎన్ఏ టెస్టుల ద్వారా ప్రతీ మృతదేహాన్ని గుర్తించి వారి వారి కుటుంబాలకు అప్పగిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో ఏపీ, తెలంగాణతో పాటు యూపీ, ఒడిశా, బిహార్ రాష్ట్రాలకు చెందిన వారు ప్రాణాలు కోల్పోయారు. వారం రోజులు గడుస్తున్నా తమ వారి ఆచూకీ తెలియకపోవడంతో కార్మికుల కుటుంబసభ్యులు హాస్పిటల్ మార్చురీకి, ధ్రువ ఆసుపత్రికి తిరుగుతున్నారు. మరికొందరు శిథిలాల కింద తమ వారు ఉంటారని సిగాచీ పరిశ్రమ

2లో..

## ఎద్దును ఢీకొట్టిన వందే భారత్ ఎక్స్ ప్రెస్

### - తృటిలో తప్పిన ప్రమాదం

**హైదరాబాద్** మహబూబాబాద్ జిల్లాలో ప్రయాణిస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు త్రుటిలో ఒక పెను ప్రమాదం తప్పింది. విశాఖపట్నం నుండి సికింద్రాబాద్ దిశగా వేగంగా దూసుకొస్తున్న ఈ ప్రీమియం రైలు, తాళ్లపూసపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో అప్ లైన్ వద్ద ఒక ఎద్దును ఢీకొట్టింది. ఈ అనూహ్య ఘటనతో రైలు



2లో..




# గ్లోబల్ సౌత్ వివక్షకు గురైంది

### - ఐరాస, డబ్ల్యూటీఓలో సంస్కరణలు రావాలన్న మోదీ

**రియో డి జనీరో :** ప్రపంచ సంస్థలలో సమగ్ర సంస్కరణలు తీసుకురావాలని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు, అవి ఆధునిక రోజుల్లో తలెత్తుతున్న సవాళ్లకు సరిపోవని అన్నారు. బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో జరిగిన 17వ బ్రిక్స్ సమ్మిట్‌లో శాంతి, భద్రత, గ్లోబల్ గవర్నెన్స్ సంస్కరణలపై ప్లీనరీ సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడారు. బ్రిక్స్ దేశాల నాయకులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగిస్తూ.. 'గత శతాబ్దంలో ఏర్పడిన ముఖ్యమైన అంతర్జాతీయ సంస్థలు కాలం చెల్లిన స్వభావాన్ని కలిగి ఉన్నాయి. ఎన్నో సంఘర్షణలు, మహమ్మారి నుండి ఆర్థిక సంక్షోభాలు, సైబర్ ముప్పుల వరకు సమకాలీన ప్రపంచ సమస్యలను పరిష్కరించడంలో అవి విఫలమవుతున్నాయి. 20వ శతాబ్దంలో ఏర్పడిన ప్రపంచ సంస్థలు 21వ శతాబ్దపు సవాళ్లను ఎదుర్కోలేకపోతున్నాయి. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న ఘర్షణలు, మహమ్మారులు, ఆర్థిక సంక్షోభాలు లేదా సైబర్‌స్పేస్‌లో కొత్తగా ఎదురవుతున్న సవాళ్లు ఏవైనా, వీటి వద్ద పరిష్కారం లేదు" అని సమ్మిట్‌లో మోదీ అన్నారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గ్లోబల్ సౌత్ ఎదుర్కొంటున్న నిర్లక్ష్యాన్ని హైలైట్ చేశారు. "గ్లోబల్ సౌత్ తరచుగా డబుల్ స్టాండర్డ్స్ కు గురైంది. అభివృద్ధి, వనరుల పంపిణీ లేదా భద్రత సంబంధిత సమస్యల గురించి గ్లోబల్ సౌత్ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వలేదు. వాతావరణ ఆర్థిక సహాయం, స్థిరమైన అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం వంటి సమస్యలపై, గ్లోబల్ సౌత్ తరచుగా కేవలం గుర్తుగా మాత్రమే మిగిలిపోయింది" అని అన్నారు. సమగ్రమైన, బహుళ అవసరాన్ని నొక్కి చెబుతూ ఇలా అన్నారు, "నేడు, ప్రపంచానికి కొత్త, బహుళ, సమగ్ర ప్రపంచ క్రమం ఉండాలి. ఇది ప్రపంచ సంస్థలలో సమగ్ర సంస్కరణలతో ప్రారంభం కావాలి. సంస్కరణలు కేవలం సాంకేతికంగా ఉండకూడదు, ప్రభావం కూడా కనిపించాలి.నిర్ణయం తీసుకోవడంలో మూడింట రెండు వంతుల మందికి ప్రాతినిధ్యం లేదన్నారు. ప్రధాని మోదీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు గణనీయంగా సహకరించే దేశాలు ఈ కీలక వేదికల నుంచి మినహాయించారని పేర్కొన్నారు. "20వ శతాబ్దంలో ఏర్పడిన ప్రపంచ సంస్థలలో మానవాళిలో మూడింట రెండు వంతుల మందికి తగిన ప్రాతినిధ్యం లేదు. నేటి ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన సహకారం అందించే దేశాలకు నిర్ణయం తీసుకునే జాబితాలో చోటు దక్కలేదు. కేవలం ప్రాతినిధ్యం ప్రశ్న మాత్రమే కాదు, విశ్వసనీయత, ప్రభావశీలతకు సంబంధించిన ప్రశ్న. గ్లోబల్ సౌత్ లేకుండా, ఈ సంస్థలు సిమ్ కార్డ్ ఉన్న మొబైల్ లాగా ఉన్నాయి కానీ నెట్‌వర్క్ లేదు" అని ఎద్దేవా చేశారు.మార్పు అత్యవసరాన్ని మోదీ పునరుద్ఘాటించారు. "ఏఐ యుగంలో, సాంకేతికత ప్రతి వారం అప్‌డేట్ అవుతున్నప్పుడు, 80 సంవత్సరాలలో ఒక్కసారైనా గ్లోబల్ సంస్థ అప్‌డేట్ కాకపోవడం ఆమోదయోగ్యం కాదు. 21 శతాబ్దపు సాఫ్ట్‌వేర్‌ను 20 శతాబ్దపు టైప్‌రైటర్ అమలు చేయలేదు." బ్రిక్స్ అనుకూలతను హైలైట్ చేశారు. "బ్రిక్స్ విస్తరణ, కొత్త స్నేహితుల చేరిక బ్రిక్స్ అనేది కాలానికి అనుగుణంగా మారగల ఒక సంస్థ అని నిరూపిస్తుంది. ఇప్పుడు, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, డబ్ల్యూటీఓ, అభివృద్ధి బ్యాంకులు వంటి సంస్థలలో సంస్కరణల కోసం అదే సంకల్పం చూపించాలి" అన్నారు. జులై 6, 7 జూలై తేదీల్లో బ్రెజిల్‌లో జరుగుతున్న 17వ బ్రిక్స్ సమ్మిట్‌లో బ్రెజిల్, రష్యా, భారతదేశం, చైనా, దక్షిణాఫ్రికా దేశాల నాయకులతో పాటు కొత్త సభ్యులు ఈజిప్ట్, యూఏఈ, ఇండోనేషియా, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా దేశాల నాయకులు పాల్గొన్నారు.ప్రధాన

2లో..

## సర్కార్ స్పందించకపోతే

# రైతులతో వెళ్లి మోటార్లు ఆన్ చేస్తాం

### - హరీష్ రావు హెచ్చరిక




**హైదరాబాద్** కన్నెపల్లి పంప్ హౌజ్, కల్వకుర్తి ప్రాజెక్టుల వద్ద మోటర్లు ఆన్ చేయకపోతే కేసీఆర్ నాయకత్వంలో వేలాదిమంది రైతులతో ప్రాజెక్టు వద్దకి వెళ్లి మోటర్లు ఆన్ చేస్తామని తెలంగాణ ప్రభుత్వాన్ని మాజీ మంత్రి హరీష్ రావు హెచ్చరించారు. పొరుగున కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో మంచి వర్షాలు పడుతున్నా తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. రాష్ట్రంలో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. రైతులు విత్తనాలు వేసే పరిస్థితి లేదు. విత్తనాలు మొలకెత్తే పరిస్థితి లేదన్నారు.తెలంగాణ భవన్‌లో హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. 'భూగర్భ జలాలు రోజురోజుకీ అడుగంటుతున్నాయి. వర్షాభావ పరిస్థితులు ఇలాగే కొనసాగితే సాగునీటికే కాదు పలు జిల్లాల్లో త్రాగునీటికి కూడా ఇబ్బందులు ఎదురవుతాయి. మహారాష్ట్ర, కర్ణాటకల్లో వర్షాలు కురవడం వల్ల కృష్ణ, గోదావరి నదుల్లో మే నెలలోనే వరదలు వచ్చాయి. రిజర్వాయర్లు , చెరువులు, చెక్ డ్యాములు నింపుకోవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తున్నది. జులై, ఆగస్టులో రావలసిన వరదలు మేలోనే వచ్చాయి. కృష్ణ, గోదావరి వరద నీళ్లను ఒడిసి పట్టుకుంటే 2 పంటలకు నీరందించే అవకాశం ఉంది. మోటర్లు ఆన్ చేసి ప్రాజెక్టుల నుంచి రిజర్వాయర్లు, చెక్ డాములు, చెరువులు నింపుకునే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు బీఆర్ఎస్ పై బురద జల్లడంలో పోటీపడుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ మీద కక్షతోని కడుపుమంటతోనే కాదనుకుంటోంది కాంగ్రెస్ పార్టీ. మాపై కోపంతో రైతులను ఇబ్బంది పెట్టవద్దు. నీళ్ల విలువ తెలియని వాళ్లు పాలకులుగా ఉండటం వల్ల తెలంగాణ రైతులు ఇబ్బంది పడుతున్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏ నదిలో ఎంత నీళ్లు వస్తున్నాయని చూసి అధికారులను, నాయకులను అప్రమత్తం చేసేవారు. జూరాలలో వరదొస్తే ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా నాయకులకు, ఇంజనీర్లకు ఫోన్లు చేసి మోటర్ల ఆన్ చేసి నీళ్లను నింపుకోవాలని చెప్పేవారు.

2లో..

## కాంగ్రెస్ పాలనలో ఎరువులకు కరవు

### - యూరియా కొరతపై విచారణ జరపాలని డిమాండ్



**హైదరాబాద్** తెలంగాణలో తీవ్రమైన ఎరువుల కొరత నెలకొందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో యూరియాను బ్లాక్ మార్కెట్లో అమ్ముతున్నారని ఆరోపిస్తూ, ఈ వ్యవహారంపై తక్షణమే విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా కేటీఆర్ స్పందించారు. "సబ్సిడీపై రూ.266.50కి లభించాల్సిన యూరియా బస్తా ధర, ఇప్పుడు రూ.325కి ఎందుకు పెరిగింది? దీనికి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు, ప్రజలకు సమాధానం చెప్పాలి" అని ప్రశ్నించారు. ఈ కృత్రిమ కొరతను

2లో..

## ఇన్ని ఇళ్లు ఇచ్చిన చరిత్ర

# ఎక్కడా లేదు

- ఖమ్మం జిల్లా మధిరలో పర్యటించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ
- ఈ ఏడాది రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామని వెల్లడి
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఎలాంటి మేలు జరగలేదని విమర్శ
- మధిరలో రూ.6.45 కోట్లతో ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ఖమ్మం** పేద ప్రజల సొంతింటి కలను తమ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఆదివారం తన సొంత నియోజకవర్గమైన ఖమ్మం జిల్లా మధిరలో పర్యటించిన ఆయన, అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి సంవత్సరంలోనే రూ.22,500 కోట్ల భారీ బడ్జెట్‌తో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని భట్టి తెలిపారు. దేశ

2లో..

# ప్రతి కాలనీలో మెరుగైన మౌలిక వసతులు ఏర్పాటే లక్ష్యం

**– ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు**



దుండిగల్, : కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని కాలనీలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా సేవలు అందిస్తున్నామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు.కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, వివిధ కాలనీల సభ్యులు, వివిధ సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్సీకి తెలియజేయడంతోపాటు పరిష్కరించాలని విన్నవించారు. ఇందుకు ఎమ్మెల్సీ రాజు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, బహదూర్ పల్లి, గ్రీన్ హిల్స్ కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్సీ శంబిపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం గ్రీన్ హిల్స్ కాలనీలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయించాలని వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ పద్మారావు, నాయకులు వెంకటేష్ గౌడ్, జహంగీర్ ,హాజీ ,షేక్ అమీన్, కాలనీ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ కస్తూరి అమర్నాథ్, జనరల్ సెక్రటరీ దామోదర్, ట్రెజరర్ నర్రా రాజు, వైస్ ప్రెసిడెంట్ రఘుపతి రెడ్డి, జెనరల్ సెక్రటరీ రాజశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు సుధాకర్, నరేష్, రాములు, నరసింహారెడ్డి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు కృషి

**– ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**



మన్సురాబాద్ : సీఎం సహాయ నిధి ద్వారా నిరుపేద కుటుంబాల జీవితాలలో వెలుగులు నింపేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. మనసురాబాద్ డివిజన్ హయత్ నగర్ పరిధి, లెక్చరర్స్ కాలనీకి చెందిన క్రాంతి కుమార్ కూతురు యశస్విని పుట్టినప్పటినుంచి ఎదుగుదల బాధపడుతుండగా ఆమెను చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు దవాఖానాలో చేర్పించారు. చికిత్స ఖర్చులు భరించలేని పరిస్థితిలో ఉన్న కుటుంబ సభ్యులు విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి సీఎం సహాయ నిధి నుంచి రూ. 1.10 లక్షలు మంజూరు చేయించారు. సదరు ఎల్ఓసి పత్రాన్ని ఆదివారం చిన్నారి తండ్రి క్రాంతి కుమార్‌కు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిదని.. పేద ప్రజలకు నాణ్యమైన అధునాతనమైన వైద్య సేవలను పొందేందుకు సీఎం సహాయనిధి అండగా ఉంటుందన్నారు.

## సెల్‌ఫోన్ స్నాచింగ్ ముఠాలోని సభ్యుడి అరెస్ట్




బంజారాహిల్స్ : రోడ్డు మీద వెళ్తున్న వ్యక్తి వద్ద నుంచి సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయిన ముఠాలోని ఓ సభ్యుడిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశాకు చెందిన అరవింద్‌కుమార్ అనే ప్రైవేటు ఉద్యోగి ఫిలింనగర్‌లో నివాసం ఉంటాడు. శనివారం తెల్లవారుజామున డ్యూటీ ముగించుకుని మరో నలుగురు వ్యక్తులతో కలిసి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద ఆటో దిగాడు. అక్కడి నుంచి నడుచుకుంటూ ఫిలింనగర్ వైపు వెళ్తున్నాడు.కాగా జర్నలిస్ట్ కాలనీ సమీపంలోకి రాగానే వెనకనుంచి బైక్‌మీద వచ్చిన ముగ్గురు యువకులు అరవింద్‌కుమార్‌ను అటకాయించారు. తన సెల్‌ఫోన్ కాజేశావంటూ గొడవకు దిగారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్దామంటూ అతడిని బలవంతంగా బైక్‌మీదకు ఎక్కించుకున్నారు. కొంతదూరం వెళ్లాక అతడి వద్ద నుంచి సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయారు. అక్కడినుంచి మాదాపూర్‌కు వెళ్లిన దుండగులు మరో యువకుడిని ఇదే విధంగా బెదిరిస్తున్న క్రమంలో అక్కడ పెట్రోలింగ్ పోలీసులు ముఠాలోని నగేష్ అనే వ్యక్తిని పట్టుకున్నారు. అతడిని విచారించగా బంజారాహిల్స్ పీఎస్ పరిధిలోని స్నాచింగ్ విషయం బయటపడింది. ఈ మేరకు నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మిగిలిన నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

## హసన్, హుస్సేన్ పీర్లను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి



ఊట్కూర్ : నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలో ఆదివారం జరిగిన మొహరం దశమి ఉత్సవ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన డప్పు చప్పులతో ఊరేగింపుగా బయలుదేరి పూలు, చక్కెర ఫాతిహా అందజేశారు. హసన్, హుస్సేన్ లకు దట్టీలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్యేను ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. భక్తుల సౌకర్యార్థం పీర్ల మసీదు పునర్నిర్మాణం చిట్టెం హయాంలో జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, యువజన అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకులు వడ్ల మోనప్ప, శివారెడ్డి, గంగాధర్ చారి, తరుణ్ రెడ్డి, ఓబేదుర్ రహిమాన్, హొటల్ ఖాలిక్, చంద్రశేఖర్ గౌడ్, ఆసిఫ్, రహీం, వడ్డే పెద్దోడు, నాగేష్ పాల్గొన్నారు.

## క్యాబ్ డ్రైవర్లే లక్ష్యంగా వరుస హత్యలు.. 24 ఏళ్లుగా పరారీలో.. ఎట్టకేలకు అరెస్ట్..!



క్యాబ్ డ్రైవర్లే లక్ష్యంగా 2001లో వరుస హత్యలకు పాల్పడ్డాడు. అప్పటి నుంచి పోలీసులకు దొరకకుండా తప్పించుకుని తిరిగాడు. ఎట్టకేలకు 24 ఏళ్ల తర్వాత ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులకు చిక్కాడు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఢిల్లీకి చెందిన అజయ్ లాంబా 2001లో జరిగిన నలుగురు క్యాబ్ డ్రైవర్ల హత్య కేసులలో నిందితుడిగా ఉన్నాడు.అజయ్ లాంబా మరో ఇద్దరితో కలిసి 2001లో క్యాబ్ డ్రైవర్లే లక్ష్యంగా హత్యలకు పాల్పడ్డాడు. అతడిపై నాలుగు హత్య కేసులో నమోదయ్యాయి. దాంతో 2008 వరకు అతడు ఇక్కడే పోలీసుల కళ్లుగప్పి తిరిగాడు. 2008లో కుటుంబంతో సహా నేపాల్‌కు వెళ్లి 2018 వరకు అక్కడే ఉన్నాడు. 2018లో భారత్‌కు వచ్చి మళ్లీ నేరాలు మొదలుపెట్టాడు. 2020లో ఒడిశా నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడ్డాడు. ఆ తర్వాత బెయిల్‌పై బయటికి వచ్చి 2021లో ఎన్డీపీఎస్ చట్టం కింద అరెస్టయ్యాడు. మళ్లీ అరెస్టై మళ్లీ బెయిల్‌పై వచ్చాడు. 2024లో ఢిల్లీలో జ్యూయెలరీ షాపులో దోపిడీకి పాల్పడ్డాడు. దాంతో పోలీసులు మళ్లీ అరెస్ట్ చేశారు. అయితే ఇన్నిసార్లు అరెస్టయినా అజయ్ లాంబా 2001లో నలుగురు క్యాబ్ డ్రైవర్లను హత్య చేసిన విషయాన్ని మాత్రం బయటపెట్టలేదు. తాజాగా పోలీసులు అతడే సీరియల్ కిల్లర్ అని గుర్తించారు. అజయ్ లాంబా తన ఇద్దరు సహచరులతో కలిసి ఉత్తరాఖండ్‌కు క్యాబ్ మాట్లాడుకునే వారని, అక్కడ డ్రైవర్‌ను హత్య చేసి అతడి దగ్గరున్న నగదు, నగలు లాక్కుని, క్యాబ్‌ను నేపాల్‌కు తరలించి అమ్ముకునే వారని పోలీసులు తెలిపారు.ఇలా ఒక ఏడాదిలోనే నాలుగు హత్యలు చేశారని పోలీసులు వెల్లడించారు. ఆ నలుగురిలో ఒక్కరి మృతదేహం మాత్రమే లభ్యమైందని, మిగతా మృతదేహాలు లభ్యం కాలేదని చెప్పారు. అజయ్ లాంబా అండ్ గ్యాంగ్ ఇంకా ఎక్కువ మందినే హత్య చేసి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, దర్యాప్తులో మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని అన్నారు.

### ప్రేమించకపోతే సోషల్‌మీడియాలో ఫోటోలు పెడతా..

## మాజీ ప్రియురాలికి వేధింపులు




బంజారాహిల్స్ : మాజీ ప్రియురాలిని వెంబడిస్తూ ప్రేమించకపోతే సోషల్‌మీడియాలో ఫోటోలు పెడ్తానంటూ బెదిరిస్తున్న యువకుడిని ఫిలింనగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి ప్రాంతానికి చెందిన మల్లుగల్ల వరప్రసాద్(23) అనే వ్యక్తి ఆల్విన్ కాలనీలో నివాసం ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటాడు. ఫిలింనగర్ పీఎస్ పరిధిలోని ఓ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్న సమయంలో యువతి(22)తో సోషల్‌మీడియా ద్వారా పరిచయం అయింది. కాగా కొన్నాళ్ల తర్వాత వరప్రసాద్ ప్రవర్తన సరిగాలేకపోవడంతో యువతి బ్రేకప్ చెప్పింది. ఇంజనీరింగ్ పూర్తిచేసిన యువతి క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగానికి సెలెక్ట్ అయింది. కాగా ఇటీవల ఆమెను వెంబడిస్తూ వేధింపులకు గురిచేస్తుండడంతో పాటు తనతో సన్నిహితంగా ఉండకపోతే ప్రైవేటు ఫోటోలు బయటపెడ్తానంటూ బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. అంతటితో ఆగకుండా యువతి తండ్రికి ఫోటోలు పంపించాడు. దీంతో తన కుమార్తెను వేధింపులకు గురిచేస్తున్న వరప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలంటూ తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు ఆదివారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## పెంపుడు జంతువులకు రేబిస్ టీకాలు వేయించాలి

హిమాయత్ నగర్ : పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా రేబిస్ టీకా వేయించాలని తెలంగాణ రాష్ట్ర పశు సంవర్ధక శాఖ అదనపు సంచాలకురాలు డాక్టర్ మహేశ్వరీ అన్నారు. ఆదివారం నారాయణగూడ సూపర్ స్పెషాలిటీ వెటర్నరీ హాస్పిటల్‌లో సూపరిండెంట్ శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 500 పెంపుడు జంతువులకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి ఎం.ప్రవీణ్ కుమార్, ఇండియన్ ఇమ్యునాలాజికల్ ప్రతినిధి ఉదయ్ శంకర్, డాక్టర్ మల్లీశ్వరి మాట్లాడారు. రేబీస్ వ్యాధి కుక్కలు, పిల్లులు, గబ్బిలాల కరచినప్పుడు వాటి లాలాజలం వల్ల సంక్రమిస్తుందని అన్నారు. ఇవి కరిచినప్పుడు కట్టు కట్టకుండా సబ్బు పెట్టి నల్లా నీళ్లతో శుభ్రంగా కడిగి వైద్యున్ని సంప్రదించి, యాంటి రేబిస్ ఇంజక్షన్, లేదా టీటీ ఇంజక్షన్ వేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు డా.ఎన్.శ్రీనివాస్ రెడ్డి, డా.బి.నవీన్ కుమార్ రెడ్డి, పశు వైద్యాధికారులు డా.అరవింద్, డా.చంద్రశేఖర్ రెడ్డి, డా.ప్రవీణ్ కులకర్ణి, డా.సురేష్, డా.రంజిత్, తివారి తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణానగర్ కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

**– ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



కాప్రా, : కాప్రా డివిజన్ ఎల్లారెడ్డిగూడ కృష్ణానగర్ కాలనీ సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం కృష్ణానగర్ కాలనీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్నికైన నూతన హౌజింగ్ వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గం ఉప్పల్ ఎమ్మెల్యేను సైనిక్‌పురిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్త కార్యవర్గాన్ని ఎమ్మెల్యే అభినందించారు.ఈ సందర్భంగా కాలనీలో డ్రైనేజీ సమస్యలు తీర్చాలని ఎమ్మెల్యేను కృష్ణానగర్ హౌజింగ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కాలనీ సమస్యల పరిష్కారం కోసం తప్పకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు యుగంధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి విక్రమ్‌కుమార్, జైకుమార్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## సిగాచీ పేలుడు ఘటన 43కి చేరిన మృతులు

వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్న చోట కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. కొన్ని మృతదేహాలకు డీఎన్ఏ నిర్వహించి గుర్తించిన తరువాత అధికారులు వారి కుటుంబసభ్యులకు అప్పగిస్తున్నారు.సిగాచీ కంపెనీలో జూన్ 30న భారీ విషాదం చోటుచేసుకుంది. సోమవారం ఉదయం సిగాచీ కంపెనీలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారికి ఒక్కో కుటుంబానికి రూ. 1 కోటి పరిహారం ఇప్పిస్తామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తక్షణ సాయం కింద మృతుల కుటుంబాలకు రూ.1 లక్ష, గాయపడిన వారికి రూ.50 వేలు అందిస్తామని చెప్పారు. జులై 1న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సిహ పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమకు వెళ్లి పరిశీలించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ 24 గంటలు గడిచినా కంపెనీ నుంచి ఎవరూ రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్టీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, హైడ్రా సిబ్బంది, ఇతర శాఖల అధికారులు, పోలీసులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.మృతుల కుటుంబాలకు సిగాచీ యాజమాన్యం జులై 2న రూ.1 కోటి పరిహారం ప్రకటించింది. గాయపడిన వారికి వైద్య సాయం అందిస్తామన్న యాజమాన్యం అన్ని రకాల క్లెయిమ్స్ చేసేందుకు వారికి అవకాశం కల్పిస్తామని చెప్పింది. ఈ మేరకు స్టాక్ మార్కెట్ కు రాసిన లేఖలో సిగాచీ యాజమాన్యం పేర్కొంది. 3 నెలల వరకు తమ ప్లాంట్‌లో కార్యకలాపాలు నిలిపివేస్తున్నామని యాజమాన్యం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైలెవల్ కమిటీ మరికొద్దిసేపట్లో సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచి కుపెనీ వద్దకు రానుంది. తెలంగాణ సీఎస్ రామకృష్ణారావు నేతృత్వంలోని హై లెవెల్ కమిటీ ఇదివరకే పలుమార్లు సిగాచి పరిశ్రమకు వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించింది. ఈ హైలెవల్ కమిటీసభ్యులుగా రెవెన్యూ, ఇండస్ట్రీ చీఫ్ సెక్రటరీ, కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఫైర్ డిజి, ఆరోగ్య శాఖ కార్యదర్శి ఉన్నారు.

## ఎద్దును ఢీకొట్టిన వందే భారత్ ఎక్స్ ప్రెస్

కొన్ని నిమిషాల పాటు అక్కడే నిలిచిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే రైల్వే సిబ్బంది అత్యంత వేగంగా స్పందించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని, పట్టాలపై పడి ఉన్న ఎద్దు కళేబరాన్ని తొలగించి, రైలు ముందుకు సాగేందుకు మార్గం సుగమం చేశారు. ఈ ప్రమాదంలో రైలు ఇంజన్ ముందు భాగంలో ఉండే క్యాటిల్ గార్డ్ (పశువుల నుండి రక్షణ కవచం) విరిగింది. డోర్నకల్ ఆర్పీఎఫ్ ఎస్ ఐ సుభాని సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. రైలు పట్టాల సమీపంలోకి పశువులను తీసుకురావద్దని స్థానిక రైతులకు ఆయన ప్రత్యేకంగా సూచించారు. రైల్వే ట్రాక్‌ల వెంట పశువుల సంచారం వందేభారత్ వంటి హైస్పీడ్ రైళ్లకు పెద్ద సవాలుగా మారింది. ఇవి రైలుకు నష్టం కలిగించడమే కాకుండా, ప్రమాదాలకు దారితీసి ప్రయాణికుల భద్రతకు ముప్పుగా పరిణమిస్తాయి.

## సర్కార్ స్పందించకపోతే రైతులతో వెళ్లి మోటార్లు ఆన్ చేస్తాం

వరద వచ్చి నెల రోజులు దాటినా కాంగ్రెస్ ప్రభుత్వం మోటార్లను ప్రారంభించలేదు.మేడిగడ్డ బ్యారేజీ గేట్లు తెరచి ఉన్నా కన్నెపల్లి పంప్ హౌస్ మోటర్లు ఆన్ చేసి నీళ్లు తీసుకునే అవకాశం ఉంది. కన్నెపల్లి పంప్ హౌస్ నుండి రోజుకు 2 టీఎంసీల నీళ్లు తీసుకునే అవకాశం ఉందని ఇంజనీర్లే చెప్తున్నారు. నది లేకున్నా రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ ఇలా దాదాపు 141 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లను నిర్మించాం. పంప్ హౌస్ లు, సబ్ స్టేషన్లు ఉన్నా నీళ్లు ఎత్తుకోవడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏమిటి.? మేడిగడ్డ దగ్గర ఈ నిమిషానికి 73,600 క్యూసెక్కుల నీళ్లు ప్రవహిస్తున్నాయి. కన్నెపల్లి పంప్ హౌస్ యొక్క మినిమం డ్రా డౌన్ లెవెల్ 93.5 మీటర్లు. నది ప్రవాహంలో ఎత్తు 73600 క్యూసెక్కుల నీళ్లు పోతే నది 96 మీటర్ల ఎత్తులో ఉంటుంది. ఎండీడీఎల్ కంటే రెండున్నర మీటర్లు ఎత్తులో నీళ్లు పోతున్నా ఎందుకు మోటర్ ఆన్ చేయడం లేదు. ఒక్కొక్క మోటారు 2100 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుంది. మేడిగడ్డ అన్ని గేట్లు ఎత్తి ఉండంగా కూడా రోజుకి రెండు టీఎంసీల నీళ్లు తీసుకునే అవకాశం ఉంది.అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు పర్ఫెక్ట్ గా ఉన్నాయని ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. పంప్ హౌస్ లక్షణంగా పనిచేస్తున్నది. బటన్ నొక్కితే నీళ్ళు వచ్చే అవకాశం ఉంది. రైతులు పంప్ హౌస్ లు ప్రారంభించాలని ఫోన్లు చేస్తున్నారు. ఎస్సారెస్పీలో 18 టీఎంసీల నీళ్లు లేవు. ఎస్సారెస్పీ కింద 14లక్షలు, మిడ్ మానేరు కింద లక్ష ఎకరాలు, కాళేశ్వరం కింద 2 లక్షల ఎకరాలు ఆయకట్టు ఉంది. కాళేశ్వరం మోటర్లు ప్రారంభిస్తే 15 జిల్లాలకు నీళ్లు ఇచ్చే అవకాశం ఉంది. ఉత్తంకుమార్ రెడ్డి నియోజకవర్గం కోదాడ వరకు ఎస్సారెస్పీ స్టేజి 2 కింద నీళ్లు ఇవ్వొచ్చు. మొదటి పంటకు సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడకు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి నిజాంబాద్, ఉమ్మడి మెదక్ జిల్లాలకు నీళ్లిచ్చే అవకాశం ఉంది. వెంటనే కాళేశ్వరం మోటర్లు ప్రారంభించి రిజర్వాయర్లు నింపి రైతులకు మొదటి పంటకు నీళ్లు ఇవ్వాలి. లేకపోతే కేసీఆర్ నాయకత్వంలో లక్షలాది మంది రైతులం కలిసి కన్నెపల్లికి వెళ్లి మోటర్లు ఆన్ మోటర్లు ప్రారంభించి నీళ్లిచ్చి చూపిస్తాం. కాళేశ్వరం అంటే 100 భాగాలు. 100 భాగాల్లో మేడిగడ్డ ఒక భాగం. 80 పిల్లర్లలో 2 పిల్లర్లు మాత్రమే కుంగాయి. 19 రిజర్వాయర్లు, 21 పంపు హౌస్ లు, 16 సబ్ స్టేషన్లు, 203 కిలోమీటర్ల టన్నెలు, 1531 కి.మీ గ్రావిటీ కెనాల్, 98 కిలోమీటర్ల ప్రెజర్మెంట్స్ కాళేశ్వరం ప్రాజెక్టులో భాగం. మేడిగడ్డకి మరమ్మత్తులు చేయాలి. మరోవైపు కన్నెపల్లి పంప్ హౌస్ ప్రారంభించి నీళ్లు ఎత్తిపోయాలి.

## కాంగ్రెస్ పాలనలో ఎరువులకు కరవు

ఎవరు సృష్టిస్తున్నారు? తెర వెనుక ఉండి ఈ బ్లాక్ మార్కెట్ దందాను నడిపిస్తున్నదెవరు? అని నిలదీశారు. ఆధార్ కార్డు తప్పనిసరి చేసినా రైతులకు కనీసం ఒక్క బస్తా యూరియా కూడా ఇవ్వలేని దుస్థితి ఎందుకొచ్చిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం రైతు భరోసా, రుణమాఫీ వంటి హామీలను అమలు చేయడంలో విఫలమైందని కేటీఆర్ విమర్శించారు.మరోవైపు, ఖరీఫ్ సీజన్‌లో యూరియా కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది. రాష్ట్రంలో 1.94 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరత ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. ఈ విషయంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గత వారమే కేంద్రానికి లేఖ రాశారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు గాను తెలంగాణకు 5 లక్షల టన్నుల యూరియాను కేటాయించిన కేంద్రం, కేవలం 3.06 లక్షల టన్నులు మాత్రమే సరఫరా చేసిందని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. తక్షణమే మిగిలిన కోటాను విడుదల చేయాలని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాను కోరారు. అలాగే, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు కూడా లేఖలు రాసి, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఇన్ని ఇళ్లు ఇచ్చిన చరిత్ర ఎక్కడా లేదు

చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఒకేసారి ఇన్ని గృహాలు కేటాయించలేదని ఆయన పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదల కోసం ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని ఆయన విమర్శించారు. తాము రైతు భరోసా కోసం రూ.17,500 కోట్లు చెల్లించామని గుర్తుచేశారు.ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తూ, రాష్ట్రంలోని 93 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. నిరుద్యోగుల కోసం రూ.8 వేల కోట్లతో 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని, డ్వాక్రా మహిళలకు రూ.లక్ష కోట్లతో రుణ సౌకర్యం కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని భట్టి విక్రమార్క వెల్లడించారు. అనంతరం, మధిర పట్టణ అభివృద్ధిలో భాగంగా రూ.6.45 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అంబారుపేట పెద్ద చెరువు ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంతో పట్టణానికి కొత్త శోభ వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## గ్లోబల్ సౌత్ వివక్షకు గురైంది

మంత్రి మోదీ, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డా సిల్వా, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా, ఇతర నాయకులు రియో డి జనీరోలోని మ్యూజియం ఆఫ్ మోడర్న్ ఆర్ట్‌లో బ్రిక్స్ ఫ్యామిలీ ఫోటో సెషన్‌లో పాల్గొన్నారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎక్స్ లో ఈ బృందం "ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి, సాధారణ విలువలను ప్రోత్సహించడానికి సామూహిక నిబద్ధత"ను ధృవీకరించింది అన్నారు.

ఆన్‌లైన్‌లో ఈ క్షణాన్ని పంచుకుంటూ, ప్రధాని మోదీ ఎక్స్ లో ఇలా రాశారు, "బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో జరిగిన సమ్మిట్‌లో బ్రిక్స్ సహచరులతో కలిసి సహకారం, ఉమ్మడి వృద్ధికి మా నిబద్ధతను చాటుకుంటున్నాం. మరింత సమగ్రమైన, సమానమైన ప్రపంచ భవిష్యత్తును రూపొందించడానికి బ్రిక్స్ సామర్థ్యాన్ని కలిగి ఉంది."అంతకుముందు, మోదీ దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రామఫోసాతో సమావేశమయ్యారు.

సమ్మిట్‌కు ఆతిథ్యం ఇచ్చినందుకు అధ్యక్షుడు లులాకు కృతజ్ఞతలు తెలిపారు. "నా స్నేహితుడు, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రామఫోసాతో సమావేశం జరిగింది" అని తెలిపారు. "ఈ సంవత్సరం రియో డి జనీరోలో బ్రిక్స్ సమ్మిట్‌కు ఆతిథ్యం ఇచ్చినందుకు అధ్యక్షుడు లులాకు కృతజ్ఞతలు. బ్రిక్స్ ఆర్థిక సహకారం, ప్రపంచ శ్రేయస్సు కోసం ఒక శక్తిగా ఉంది." బ్రిక్స్ సమ్మిట్‌లో, శాంతి, భద్రత, కృత్రిమ మేధస్సు, వాతావరణ మార్పులు, ప్రపంచ ఆరోగ్యం, ఆర్థిక విషయాలతో సహా కీలకమైన ప్రపంచ సమస్యలపై ప్రధాన మంత్రి మోదీ తన అభిప్రాయాలను పంచుకునే అవకాశం ఉంది.

## పాత విద్యుత్ స్తంభాలను
# దుర్వినియోగం చేయకండి



**మెదక్ జూలై 06 (ప్రజా స్వరం)** ముఖ్యమైన స్థలాల్లో పాత విద్యుత్ స్తంభాలను వేయాలని మెదక్ పట్టణ బిఆర్ఎస్ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ మెదక్ పట్టణ మెయిన్ రోడ్డు డివైడర్ లో గతంలో మున్సిపల్, ఆర్అండ్బి అధికారులు వేసినటువంటి విద్యుత్ స్తంభాలను తీసివేసి హైవే అథారిటీ వారు వేస్తున్నటువంటి కొత్త విద్యుత్ స్తంభాల నిర్మాణంతో పాత విద్యుత్ స్తంభాలను స్క్రాప్ కింద దుర్వినియోగం చేయకూడదని అన్నారు. ఆ పాత స్తంభాలను మున్సిపల్ అధికారులు మెదక్ పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు నుండి ఆర్అండ్బి రోడ్ వరకు అదే విధంగా బంగ్ల చెరువు, పిట్లం చెరువు, మల్లం చెరువు మినీ ట్యాంక్ బండ్, స్మశాన వాటికల దగ్గర ముఖ్యమైన పార్కుల్లో ఏర్పాటు చేయాలని కోరారు

## బీసీ గురుకులానికి 50 ఫ్యాన్లు అందజేత



**మొయినాబాద్(ప్రజాస్వరం) :** మొయినాబాద్ మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, కళాశాలలో చదువుతున్న విద్యార్థులు శివ ప్రసాద్,లాలు ప్రసాద్, తండ్రి కంచం అంజయ్య ఎంజేపీ గురుకుల పాఠశాలకు 50 ఫ్యాన్లు అందజేశారు.వారికి ఎంజేపీ గురుకుల సెక్రెటరీ సైదులు, ప్రిన్సిపాల్ జంగం నరేష్ మరియు సిబ్బంది అతనికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్ట్ టీచర్ రాజేష్, పీడీ శ్రీనివాస్, దేవులపల్లి రమేశ్, రాథోడ్ మోహన్, కిరణ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి వేడుకలు



శామీర్ పేట, జూలై 6 (ప్రజ స్వరం) బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేటలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తుంకి రమేష్ ఆధ్వర్యంలో భారత స్వర్గీయ ఉపప్రధాన మంత్రి బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వైఎస్ గౌడ్, మాజీ జడ్పిటిసి పి. బాలేష్, ఏఎంసి డైరెక్టర్ తుంకి భిక్షపతి, నాయకులు తుంకి మల్లేష, వంగ నరసింహ రెడ్డి, అబ్బగౌని భాస్కర్ గౌడ్, కైరా గణేష్, మేడి నర్సింగ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ భవన నిర్మాణ
# నూతన కమిటీ ఎన్నిక
### - అధ్యక్షునిగా తుంకి మల్లేష్ ఏకగ్రీవ ఎన్నిక



**శామీర్ పేట ( ప్రజాస్వరం) :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన నిర్మాణ నూతన కమిటీని ఎన్నిక చేశారు. శామీర్ పేట అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఇందులో భావన నిర్మాణం కొరకు ప్రత్యేకంగా సమావేశం జరిపారు. రూ. 15 లక్షల ఎంపీ లాండ్స్ నిధులతో భవనం అసంపూర్తిగా మిగిలిపోయిందని, నిధులు మంజూరు అయ్యే వరకు దాతల సహకారంతో పనులు చేపట్టాలని కమిటీ తీర్మానం చేసింది. నూతన కమిటీని ఎన్నిక చేశారు.

### నూతన కమిటీ....

నూతన కమిటీ అధ్యక్షుడిగా తుంకి మల్లేష్, ఉపాధ్యక్షుడిగా బొమ్మల నాగరాజు, జనరల్ సెక్రెటరీగా తుంకి బిక్షపతి, సెక్రటరీగా డేవిడ్, కోశాధికారి గా పోలమల్ల బాలేష్, ఆర్గనైజ్ సెక్రటరీగా నీరుడు బాలేష్, జాయింట్ సెక్రటరీగా బందెల నరేష్, సభ్యుడిగా పోరాడి వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా కైర గణేష్, పసుల జాంగిర్, మేడి బిక్షపతి, పీటర్, మేడి రాజు, సిరిసాదుల మైసయ్య, బోయని రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# ఘనంగా సాధు సత్యనారాయణ జన్మదిన వేడుకలు







**మనోహరాబాద్ (ప్రజాస్వరం) :** బీజేపీ మనడం పార్టీ ఉపాధ్యక్షులు సాధు సత్యనారాయణ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసే నాయకుడు సత్యనారాయణ అని పలువురు కొనియాడారు.

ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవకే అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రజలకు సేవలందించే గొప్ప నాయకుడు అని అన్నారు. జన్మదిన వేడుకలు నిర్వహించిన వారిలో బీజేపీ నాయకులు పురం మహేష్, మండల బీజేపీ అధ్యక్షులు వెంకట్, మండల ప్రధాన కార్యదర్శులు నత్తి మల్లేష్, సాయి కిరణ్, నరేష్ , శ్రీశీలం, శ్రీకాంత్, భాస్కర్ గిరీష్ లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకం పెంచాలి

- వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలి..
- అత్యవసర విభాగం సిబ్బంది అందుబాటులో ఉండాలి...
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్...
- ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్..



**మెదక్ జూలై 06 (ప్రజా స్వరం)** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకాన్ని పెంపొందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారం వెల్దుర్తి మండల కేంద్రలోనీ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వ హాస్పిటల్ పట్ల ప్రజలలో నమ్మకాన్ని పెంపొందించుకునేలా అంకితభావంతో పని చేయాలని అన్నారు. అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించారు. ఓ.పి రిజిస్టర్ ని పరిశీలించారు. ప్రతి రోజు ఎంత మంది పేషెంట్లు వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది గురించి ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అత్యవసర విభాగం సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. హాస్పిటల్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని శానిటేషన్ సిబ్బంది ని ఆదేశించారు. ప్రసవాల సంఖ్య పెంచాలని డాక్టర్లకు సూచించారు. సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని వైద్యులకు సూచించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమం లో వైద్యాధికారులు, సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి





**మెదక్ జూలై 06 (ప్రజా స్వరం)** డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆదివారం మెదక్ జిల్లా బిజెపి పార్టీ కార్యాలయంలో జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎమ్ఎల్ఎన్ రెడ్డి, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు గడ్డం కాశీనాథ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సుభాష్ గౌడ్, పట్టణ అధ్యక్షులు ప్రసాద్, బిజెపి సీనియర్ నాయకులు కల్కి నాగరాజు, రంజిత్ రెడ్డి, సుధాకర్, విట్టల్, లోకేష్, ఆంజనేయులు, రమేష్, శివ, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 12 ఏళ్లుగా డ్యూటీ చేయకుండా..
# రూ.28 లక్షలకుపైగా జీతం తీసుకున్న పోలీస్




భోపాల్: పోలీస్ శాఖలో చేరిన ఒక కానిస్టేబుల్ చాలా కాలంగా డ్యూటీకి హాజరుకాలేదు. అయినప్పటికీ ప్రతి నెల జీతం అందుకున్నాడు. ఇప్పటి వరకు రూ.28 లక్షలకుపైగా వేతనం తీసుకున్నాడు. 12 ఏళ్ల తర్వాత ఈ విషయాన్ని పోలీస్ శాఖ గుర్తించింది. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో ఈ సంఘటన జరిగింది. 2011లో ఒక వ్యక్తి కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. తొలుత భోపాల్ పోలీస్ లైన్స్‌లో అతడ్ని నియమించారు. కొన్ని రోజుల తర్వాత ట్రైనింగ్ కోసం సాగర్ పోలీస్ శిక్షణ కేంద్రానికి పంపారు.కాగా, ఆ కానిస్టేబుల్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో రిపోర్ట్ చేయలేదు. విదిషలోని తన ఇంటికి తిరిగి వెళ్లిపోయాడు. దీని గురించి పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వలేదు. అలాగే సెలవు కూడా కోరలేదు. అనంతరం స్పీడ్ పోస్ట్ ద్వారా సర్వీస్ రికార్డును భోపాల్ పోలీస్ లైన్స్‌కు తిరిగి పంపాడు. అయితే ధృవీకరించకుండానే ఆ ప్రతాలను ఆమోదించారు.మరోవైపు ఆ కానిస్టేబుల్ ట్రైనింగ్ సెంటర్‌కు హాజరుకాకపోవడాన్ని, అలాగే భోపాల్ పోలీస్ లైన్స్‌లో విధులు నిర్వహించకపోవడాన్ని ఎవరూ కూడా పట్టించుకోలేదు. అతడు డ్యూటీలో ఉన్నట్లుగా అంతా భావించారు. ప్రతి నెలా అతడి బ్యాంకు ఖాతాలో జీతం జమ చేశారు. ఇలా 12 ఏళ్ల పాటు ఎలాంటి పోలీస్ విధులు నిర్వహించకుండానే ఆ వ్యక్తి రూ.28 లక్షలకుపైగా వేతనం పొందాడు.కాగా, 2011 బ్యాచ్ కానిస్టేబుల్స్ పే గ్రేడ్ పెంచేందుకు 2023లో చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈ విషయం బయటపడింది. దీంతో 12 ఏళ్లుగా విధులకు హాజరుకాకుండా జీతం పొందుతున్న ఆ కానిస్టేబుల్ సంగతి తెలిసి అధికారులు షాక్ అయ్యారు. అతడి రికార్డులు, సర్వీస్ వివరాలు కూడా ఎక్కడా కనిపించలేదు. దీంతో పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయం వెళ్లింది. ఈ నేపథ్యంలో అంతర్గతంగా విచారణ జరిపారు.మరోవైపు ఆ కానిస్టేబుల్‌ను భోపాల్ పోలీస్ లైన్స్‌కు పిలిపించి ప్రశ్నించారు. అయితే తాను మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నానని అతడు తెలిపాడు. అందుకే ఇన్నేళ్లుగా విధులకు హజరుకాలేదని చెప్పాడు. దీనికి సంబంధించిన పత్రాలు చూపించాడు. రూ.1.5 లక్షలు తిరిగి ఇచ్చాడు. మిగతా డబ్బులు కూడా ఇస్తానని అన్నాడు. ఈ సంఘటనపై పోలీస్ అధికారులు మరింతగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ అంశంలో నిర్లక్ష్యం వహించిన పోలీస్ సిబ్బంది, అధికారులపైనా చర్యలకు సిద్ధమవుతున్నారు.

# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

# మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్

హైదరాబాద్ సోమవారం 7, జులై 2025


## హత్య కేసులో జీవితఖైదు.. ఆపై బెయిల్..
## అత్యాచారం కేసులో అరెస్ట్..!




ఇప్పటికే ఒక హత్య కేసులో జీవితఖైదు పడిన వ్యక్తి బెయిల్‌పై బయటికి వచ్చి అత్యాచారం కేసులో అరెస్టయ్యాడు. దేశ రాజధాని ఢిల్లీ లో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హర్యానా రాష్ట్రం ఝజ్జర్ జిల్లా బహదూర్‌గఢ్ మున్సిపాలిటీలోని పటేల్‌నగర్ ఏరియాకు చెందిన మన్‌జీత్ అలియాస్ మంజా 2009లో ఓ హత్య కేసులో అరెస్టయ్యాడు.అతడితోపాటు అరుణ్ దబాస్ అలియాస్ బిట్టు అనే వ్యక్తికి కూడా జీవితఖైదు పడింది. ఈ ఇద్దరూ కలిసి తమతో కలిసి నేరాలు చేసే మరో వ్యక్తిని హత్య చేశారు. ఈ కేసు విచారించిన చండీగఢ్ హైకోర్టు 2012లో నిందితులిద్దరినీ దోషులుగా తేల్చి జీవితఖైదు విధించింది. ఆ తర్వాత 2015లో మంజా బెయిల్‌పై బయటికి వచ్చాడు.ఇప్పటికే ఓ కేసులో శిక్ష అనుభవిస్తున్నా అతడు తన ప్రవర్తనను మార్చుకోలేదు. గత నెలలో ఢిల్లీలో ఓ మహిళపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు జూన్ 11న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడి కోసం గాలింపుచేపట్టారు. అయితే 20 రోజులకుపైగా పోలీసుల కళ్లుగప్పి తప్పించుకున్న మంజా ఈ నెల 3న పట్టుబడ్డాడు. హర్యానాలోని తన స్వస్థలానికి నిందితుడు వచ్చినట్లు తెలుసుకున్న ఢిల్లీ పోలీసులు అక్కడికి వెళ్లి హర్యానా పోలీసుల సాయంతో అతడిని అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని ఆదివారం మీడియాకు వెల్లడించారు. నిందితుడిపై గతంలో ఉన్న పెండింగ్ కేసుల గురించి కూడా ఆరా తీస్తున్నామని తెలిపారు.

## తాటి చెట్లను తొలగించవద్దంటూ
## గీత కార్మికుల ఆందోళన



పోచారం : వెంచర్ అభివృద్ధి పేరిట గీత కార్మికులకు ఉపాధినిచ్చే తాటి చెట్లను తొలగించి ఉపాధిని దూరం చేయవద్దని పోచారం మున్సిపాలిటీ కొర్రెముల గౌడ సంఘం నాయకులు, గీత కార్మికులు ఆదివారం ఆందోళనకు దిగారు. సర్వే నంబర్ 311,312,313,324,324,326పి,327లలో దాదాపు 12 ఎకరాల విస్తీర్ణంలో వెంచర్‌ను ఏర్పాటు చేస్తున్నారు.ఈ సందర్భంగా ఈ భూమిలోని 85 తాటి చెట్లను ఎలాంటి సమాచారం లేకుండా వెంచర్ నిర్వాహకులు తొలగించడంతో దాదాపు రెండు వందల మంది గౌడ సంఘం సభ్యులు వెంచర్‌లో దీక్ష చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గౌడ సంఘం నాయకుడు పంజాల జైహింద్ గౌడ్ పాల్గొని మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొర్రెముల కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్షుడు సుదర్శన్, ఉపాధ్యక్షుడు బుర్ర వెంకటేశం, మాజీ సర్పంచ్ బైరు రాములు గౌడ్, నాయకులు పల్లె బాబురావు, అనిల్ గౌడ్, బైరు పాండు గౌడ్, కట్ట ఆంజనేయులు గౌడ్, దేశగోని బాల్‌రాజ్ గౌడ్ గీత కార్మికులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి
### - మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



వనపర్తి : ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తాము కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకోలేని దుస్థితి ఏర్పడినదని వెల్లడించారు.ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో యువ నాయకుడు ఏరువ సాయిప్రసాద్ యాదవ్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీలకు చెందిన యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా కింద రూ. 15వేలు ఇస్తామని, ఆసరా పింఛన్లు రూ. 4వేలు , కల్యాణ లక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తామని మోసం చేశారరని ఆరోపించారు. మహిళలకు రూ. 2,500ఇస్తామని, ధాన్యంపై క్వింటాలుకు బోనస్ రూ. 500ఇస్తామని ఎగ్గొట్టారని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు ఎన్నో ఆంక్షలు పెట్టి అర్హులకు అందకుండ చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ హయంలో నియోజకవర్గంలో 3,250 డబుల్ బెడ్ రూమ్స్ కట్టించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తప్పిదాలను నాయకులు,కార్యకర్తలు ప్రజలకు వివరించి స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ , పార్టీ మండల అధ్యక్షులు కే.మాణిక్యం, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, కురుమూర్తి యాదవ్, సింగిల్ విండో అధ్యక్షులు రఘువర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ భాను ప్రకాష్ రావు, నాయకులు మాధవ్ రెడ్డి, రవిప్రకాష్ రెడ్డి, దేగ మహేశ్వర్ రెడ్డి, చిట్యాల రాము, ఇమ్రాన్, మాజీ కౌన్సిలర్లు నాగన్న యాదవ్, ప్రేమ్ నాథ్ రెడ్డి, నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## దత్తగిరిలో వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు



ఝరాసంగం : ప్రకృతికి, మానసిక ప్రశాంతతకు నిలయమైన బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం దత్తాత్రేయ స్వామి వారికి సుప్రభాత సేవ, గోపూజ, గణపతి పూజ, ఉదయం 10:15 నిమిషాలకు యజ్ఞశాల ప్రవేశం. వైదిక విద్యార్థులతో వేదమంత్రాల మధ్య ప్రవేశం నిర్వహించారు. 11 గంటలకు నారాయణ హెూమం వేదమంత్రాలు వల్లిస్తూ పురోహితులు నారాయణ హెూమాన్ని ప్రారంభించారు. 12 గంటలకు నారాయణ హెూమం పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి మహావిష్ణువుకి ఇష్టమైనటువంటి బ్రహ్మ కమలాలు ఒకేసారి 5 వికసించాయి. ఆ పుష్పాలను స్వామివారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతులు 1008 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, మహామండలేశ్వర డాక్టర్ మహంత్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్, నందిని శ్రీగిరిమాత, వైదిక పాఠశాల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

## మొహరం వేడుకల్లో
## కన్నుల పండువగా డోలారోహణం



ఊట్కూర్ : మత సమరస్యానికి ప్రతికగా జరుపుకునే మొహరం ఉత్సవ వేడుకల్లో భాగంగా నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలో హసన్, హుస్సేన్ పీర్ల సవారిని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం, సాయంత్రం పీర్ల చావడి నుంచి పురవీధుల్లో నిర్వహించిన సవారి (ఊరేగింపు) లో కుల, మతాల కతీతంగా భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు. వేడుకల సందర్భంగా యువకుల అలైబలై ఆటలు, మహిళలు బొడ్డెమ్మలతో సందడి చేస్తూ చూపరులను విశేషంగా ఆకట్టుకున్నారు. గ్రామంలోని రుద్రా నగర్ వీధిలో నిర్వహించిన డోలారోహణం కార్యక్రమాన్ని కన్నుల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆరకటికే వంశంలో పుట్టిన పసి బిడ్డలను ఊయలలో ఊగించి నామకరణం చేశారు.ఆదివారం రెండవ రోజు దశమి వేడుకల సందర్భంగా భక్తులు గొర్రెలు, మేకలతో కందూర్లు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. నారాయణపేట డీఎస్పీ లింగయ్య, మక్తల్ సీఐ రామ్ లాల్, ఎస్సై లు రమేష్, శివ శంకర్, మద్దయ్య, రేవతి, గాయత్రి బందోబస్తులో పాల్గొన్నారు. పలువురు ప్రజా ప్రతినిధులు మేళ తాళాలతో ఊరేగింపుగా వెళ్లి పీర్ల చావడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు మిఠాయిలను పంచి పెట్టారు.

## ఇద్దరు యువకుల మధ్య స్వలింగ సంపర్క సంబంధం..
## కూల్ డ్రింక్‌లో విషం కలిపి మైనర్ హత్య




ముంబై: ఇద్దరు యువకుల మధ్య స్వలింగ సంపర్క సంబంధం ఉన్నది. ఆ యువకుడికి దూరంగా ఉంచేందుకు మైనర్ బాలుడి కుటుంబం ప్రయత్నించింది. కలత చెందిన యువకుడు కూల్ డ్రింక్‌లో విషం కలిపి ఆ బాలుడ్ని హత్య చేశాడు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. 19 ఏళ్ల యువకుడు, 16 ఏళ్ల బాలుడి మధ్య స్వలింగ సంపర్క సంబంధం ఏర్పడింది. నాలుగు నెలల కిందట వారిద్దరూ నాగ్‌పూర్ వెళ్లి గడిపారు. ఈ విషయం తెలిసిన మైనర్ బాలుడి కుటుంబం అతడ్ని కట్టడి చేశారు. సంబంధం ఉన్న యువకుడిని కలవవద్దని, మాట్లాడవద్దని చెప్పారు.కాగా, తనకు దూరంగా ఉండటంపై కలత చెందిన యువకుడు ఆ బాలుడ్ని హత్య చేయాలని ప్లాన్ చేశాడు. జూన్ 29న తన వద్దకు రప్పించాడు. కూల్ డ్రింక్‌లో విషం కలిపి ఇచ్చాడు. అది తాగిన బాలుడు వాంతి చేసుకున్నాడు. ఆ తర్వాత అక్కడి బెడ్‌పై మరణించాడు.

మరోవైపు కుమారుడు కనిపించకపోవడంతో బాలుడి కోసం తండ్రి వెతికాడు. ఆ యువకుడి వద్దకు వెళ్లినట్లు బాలుడి ఫ్రెండ్ చెప్పాడు. దీంతో బాలుడి కుటుంబ సభ్యులు ఆ యువకుడి ఇంటికి చేరుకున్నారు. బెడ్‌పై అచేతనంగా పడి ఉన్న కుమారుడ్ని చూశారు. ఆ పక్కనే ఆ యువకుడు కూడా కూర్చొని ఉన్నాడు. కాగా, డాక్టర్‌ను పిలిపించగా ఆ బాలుడు మరణించినట్లు నిర్ధారించారు. దీంతో అతడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలుడి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వలింగ సంపర్క సంబంధానికి దూరంగా ఉన్నందుకు బాలుడ్ని ఆ యువకుడు హత్య చేశాడన్న ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

తాండూర్ : తాండూర్ మండలం బోయపల్లి బోర్డు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు తాండూర్ ఎస్సై డీ కిరణ్ కుమార్ తెలిపారు. అయిలి మల్లేష్ (36) అనే వ్యక్తి రాత్రి తాండూర్ మండలంలోని పంజాబీ దాబా నుంచి బిర్యానీ తీసుకొని మోటార్ సైకిల్‌పై బోయపల్లి బోర్డు వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతుడి స్వస్థలం ఓదెల కాగా ఉపాధి కోసం కాసిపేట గ్రామంలో ఉంటూ కల్లు గీస్తూ భార్య పిల్లలతో కలిసి ఉంటున్నాడు. మృతుడు మల్లేష్ కు భార్య రాధిక, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## ఈ నెల 24న శ్రీశైలంలో కౌండిన్య
## గౌడసత్రం కార్యవర్గం ఎన్నిక : దేవస్థానం




ఈ నెల 24న శ్రీశైలం దేవస్థానంలో కౌండిన్య గౌడసత్రం తాత్కాలిక కార్యవర్గం ఎన్నిక నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. శ్రీశైలం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు వసతి, భోజన సదుపాయం కల్పించేందుకు దేవస్థానం పరిధిలో ఆయా సామాజిక వర్గాలకు దేవస్థానం భూమిని కేటాయించింది. ఇందులో కౌండిన్య గౌడసత్రం సైతం ఒకటి. సదరు సత్రం నిర్వహణలో కార్యవర్గం మధ్య అభిప్రాయ బేధాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో కొత్తగా తాత్కాలిక కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని సదరు సత్రం నిర్వాహకులు దేవస్థానం అధికారులను కోరారు. అందుకు అనుగుణంగా దేవస్థానం సిబ్బంది సమక్షంలో కౌండిన్యగౌడ సత్రం నూతన తాత్కాలిక కార్యవర్గాన్ని ఏర్పాటు చేసేందుకు ఈ నెల 24న ముహూర్తం నిర్ణయించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఈ చంద్రశేఖరరెడ్డి, కార్యనిర్వాహక ఇంజినీర్ పీ మురళీబాలకృష్ణ, పర్యవేక్షకులు ఎం శ్రీనివాసరావు, ఎం మల్లికార్జున, ఈ మల్లిక్ రాజా, సీనియర్ అసిస్టెంట్ కే శ్రీనివాసులును సభ్యులనుగా నియమించారు. వీరి ఆధ్వర్యంలో కార్యవర్గం ఎంపిక జరుగనున్నది. ఈ నెల 24న ఉదయం 11 గంటలకు కౌండిన్య సత్రంలో ప్రత్యేక సమావేశం జరుగుతుందని.. వివాదరహితంగా కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని కౌండిన్య గౌడ కులపెద్దలు, దోనర్లకు దేవస్థానం సూచించింది.

## తొలి ఏకాదశి స్పెషల్..
## కల్యాణ రామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



గుమ్మడిదల: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కల్యాణ రామ చంద్రస్వామి దేవాలయంలో లక్ష తులసీ దళాలతో అర్చనను వైభవంగా నిర్వహించారు. ఆదివారం గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీదేవి భూదేవి మేత కల్యాణ రామచంద్రస్వామి దేవాలయంలోని ఆలయ వంశ పారంపర్యకులు కేవీ నర్సింహాచార్యులు, కేవీ రంగనాథచార్యులు, అచ్చుతాచార్యుల ఆధ్వర్యంలో తొలి ఏకాదశి పూజలను నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులు సామూహికంగా లక్ష తులసి దళాలతో అర్చనలు చేశారు. అనంతరం వచ్చిన భక్తులు కల్యాణ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి, ధర్మకర్తలు, మున్సిపాలిటీ భక్తులు పాల్గొన్నారు.

### నేత్ర పర్వంగా తొలి ఏకాదశి..

తొగుట : తొలి ఏకాదశి పర్వదినంను పురస్కరించుకొని మండలంలోని వెంకట్రావుపేట వేణుగోపాల స్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.. ఆలయ కమిటీ చైర్మన్ రాయరావు అరుణదిరఘుపతి రావు, ఆలయ అర్చకులు రామకృష్ణ చార్యులు ఆధ్వర్యంలో ఆలయం లో శ్రీ వేణుగోపాల స్వామి వారికి ప్రత్యేక అర్చన, తులసి అభిషేకం, ప్రత్యేక పూజాది కార్యక్రమం లు నిర్వహించారు. శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయములో తొలి ఏకాదశి సందర్భముగా సహకరించిన గ్రామ ప్రజలకు ధన్యవాదములు తెలుపుకుంటూ గ్రామము దిన దిన అభివృద్ధిచెందాలని మన వేణుగోపాల్ స్వామి కృపా కటాక్షాలు అందరిమీదా ఉండాలని స్వామి వారి మంగళ శాసనములు తెలియజేశారు. తొలి ఏకాదశి సందర్భంగా గ్రామంలో పూర్తి స్థాయిలో ప్రజలు భక్తి శ్రద్ధలతో శాఖాహారం తీసుకున్నందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు..తొగుట ఏ ఎస్ ఐ జీడిపల్లి రాంరెడ్డి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు..అలాగే గ్రామంలోని దళిత గోవిందం వెంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు..

## కేరళ ఎయిర్‌పోర్టులో
## కదిలిన బ్రిటన్ యుద్ధ విమానం



సాంకేతిక కారణాలతో గత మూడు వారాలుగా కేరళ లోని తిరువనంతపురం ఎయిర్‌పోర్టు లో నిలిచిపోయిన బ్రిటన్ రాయల్ నేవీ కి చెందిన యుద్ధ విమానం ఎఫ్-35బి ఎట్టకేలకు కదిలింది. ఆ విమానం మరమ్మతుల కోసం నిపుణులు దానిని హ్యాంగర్‌కు తగిలించి పార్క్ చేసిన ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తరలించారు.ఆ ఫైటర్ జెట్‌కు మరమ్మతులు చేసేందుకు యూకే నుంచి 24 మంది ఏవియేషన్ ఇంజినీర్ల బృందం ప్రత్యేక పరికరాలతో రాయల్ ఎయిర్ ఫోర్స్ విమానంలో ఆదివారం కేరళకు చేరుకుంది. ఆ విమానానికి మరమ్మతులు చేసేందుకు దానిని హ్యాంగర్‌కు తగిలించి తరలించారు. విమానం మరమ్మతు ఇక్కడ పూర్తవుతుందా లేదా అనే సంగతిని బ్రిటన్ నిపుణుల బృందం పరిశీలించనుంది. ఇక్కడే మరమ్మతు పూర్తయితే ఆ విమానం స్వయంగా బ్రిటన్‌కు వెళ్లనుంది.ఒకవేళ ఇక్కడ మరమ్మతు పూర్తయ్యే అవకాశం లేకపోతే దాన్ని సీ-17 గ్లోబ్‌మాస్టర్ అనే రవాణా విమానంలో బ్రిటన్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కేరళ విమానాశ్రయంలో మూడు వారాలుగా ఉన్న ఫైటర్ జెట్ ఎఫ్-35బి విమానానికి భారీ భద్రత కల్పించామని, సాయుధ సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ సిబ్బంది కాపలాగా ఉన్నారని భారత అధికారులు తెలిపారు.కాగా గత నెల ఇండో-యూకే నేవీ విన్యాసాల్లో పాల్గొన్న ఈ ఎఫ్-35బి విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దాంతో ఆ విమానాన్ని జూన్ 14న అర్ధరాత్రి తర్వాత తిరువనంతపురం ఎయిర్‌పోర్టులో ల్యాండ్ చేశారు. తొలుత ప్రతికూల వాతావరణం, ఇంధన కొరత కారణంగా విమానాన్ని అత్యవసరంగా దించినట్లు వార్తలు వచ్చాయి.

%Edited, Printed, Published and Owned by PURAM MAHESHWAR Printed at HARI HARA ART PRINTERS,H.No.6-185,Toopran,Dist.Medak, Telangana-502336. and Published at H.No. 4-50/18,Kallakal, Vill-Kallakal,(PO). Kadlakal,(M) Manoharabad, Dist.Medak-Telangana -502336. Editor: PURAM MAHESHWAR. RNI. No:TELTEL/2006/17154. Cell:800860999